# కాలం నవ్వింది

అది కాకి అరిస్తే కోకిల కూసిందనుకునే కాలం అన్నాడు ఒక బెంగాలీ కథకుడు. అంతటితో ఊరుకుంటే నేను తెలుగు కథకుణ్ని ఎల్లా అవుతాను:

అది కొంగలన్నీ రాజహంసలుగానూ, ఊరి మురికి గుంటలన్నీ మానస సరోవరాలు గానూ కనబడేకాలం అంటాను. అంతేకాదు. అప్పుడు మనసుకి కనబడేవన్నీ మెర్క్యూరీ దీపపు వెలుగులో ఆకస్మికంగా చూసిన ముఖాల్లాగా వింత ఆకర్షణతో కనిపిస్తయ్. అప్పుడు మనిషి కళ్ళని ఏదో చెప్పలేని భ్రాంతి వచ్చి ముసుకవేస్తుంది. అప్పుడు మనుష్యులకి తన భార్య ఊర్వశిగానూ, తన భర్త మన్మథుడిగానూ కనిపిస్తారు. ఇంతెందుకు? అది లేనిది వున్నట్లుగా కనిపించే కాలమంటే సరిపోతుంది. అది ప్రపంచమే స్వర్గంగా కనిపించే తరుణమంటే చిక్కు తీరిపోతుంది.

ఇప్పుడు సరిగ్గా అదే స్థితిలో వున్నారు మన కథానాయకుడయిన కొండలరావూ, అతని భార్య పున్నమ్మా. పెద్దల మాట పెడచెవినిపెట్టి కొండలరావు మనసుపడి పున్నమ్మని పెళ్ళిచేసుకున్నాడు. పెళ్ళిశుభలేఖల్లోనే ఇదివరదాకా పున్నమ్మగా వున్న పేరు ఒక్కసారి పూర్ణిమగా మారి బంధువులందరి కళ్ళనీ మిరుమిట్లు గొలిపేసింది. కాని కొండలరావు మాత్రం మునుపటి పేరునే మరికొంతకాలం మోయవలసి వచ్చింది. గ్రుడున యేడాది తిరగకమునుపే పూర్ణిమ కాపు

రానికి వచ్చింది. వచ్చే రావటంతోనే పూర్ణిమాదేవిగారు భర్తగారి పేరు కొండలమీది బండరాళ్ళను గుర్తుకి తెచ్చేటంత మోటుగా వుందని భావించి ఒక శుభసమయాన దాన్ని చక్రురున మార్చివేశారు. తత్ఫలితంగా కొండలరావుగారు అమాంతంగా గిరికుమారులుగా మారిపోయి బంధు మిత్ర సహచర వర్గాలవారి నందరినీ జరితెన్నూ లేని ఆశ్చర్య సాగరంలో మునకలు వేయించారు.

పూర్ణిమ కాపురానికి రాగానే పెళ్ళికి రాని బంధువులంతా ఒక్కొక్కరూ వచ్చి చూచి వెళ్ళటం సాగించారు. పోనీ వచ్చినవాళ్ళు ఊరికే పోతారా: "కొందరు ఏమంత బాగుందమ్మా" అని పెదవి విరిచారు, కొందరు. "ఈపాటి అందాన్ని చూసేనా మనవాడు అన్ని పిల్లిమొగ్గలువేశాడు" అనీ. మరికొందరు "ఈ అప్సరస కోసమేనా కాళ్ళదగ్గరకి వచ్చిన బంగారంలాంటి సంబంధాలన్నీ తిరగ్గొట్టి వేశాడు:" అనీ, ఇంకొందరు "మనకెల్లావుంటే యేం? వాడికళ్ళకి బాగుండటం. వాళ్ళిద్దరి మనసులూ కలిసి సుఖంగా ఉండటంకదా కావల్సింది" అనీ ఎవరికి తోచిన అభిప్రాయం వాళ్ళు వెల్లడించారు. అవన్నీ ఇక్కడ చెప్పటం మీకు అప్రస్తుతం మనిపించవచ్చును. కాదని నామనవి. ఎందుకంటారా? ఇంతమంది కళ్ళకి పూర్ణిమ ఏమంత చెప్పుకోదగ్గ అందకత్తెగా కనిపించకపోయినా గిరికుమారుడి కళ్ళకిమాత్రం పూర్ణిమకంటె రూపసి ముల్లోకాలలోనూ లేదనిపిస్తుంది. గిరికుమారుడి హృదయం అనుక్షణమూ తుమ్మెదలాగా ఝుంకరిస్తూ పూర్ణిమ చుట్టూ గిరగిర తిరుగుతోంది.

ఇది కేవలం ఒక్క గిరికుమారుడి అనుభవమే అయితే దానికి మనం ఇంత విలువ ఇవ్వక్కర్లేదు. కాని పూర్ణిమ కళ్ళకికూడా లోకంలో వున్న అందమంతా గిరికుమారుడి రూపంలో వచ్చి ఎదుట నిలబడ్డట్లనిపిస్తోంది. అతనివి గుంట కళ్ళనీ, చట్టిముక్కనీ, నెరిసిన జుట్టు అనీ ఇతరులెవరయినా అంటే పూర్ణిమ ఒక్క చిరునవ్వులో ఆలోపాలన్నిటినీ ఎగర కొట్టేసేది. అంతకంటె అందమైన హృదయం ఎవరికుంది? అతన్నిమించిన మంచితనం ఎవరికుంది? అంటూ మనసులో ఒక గిరికుమార స్తవాన్ని పఠించి పారాయణం చేయనారంభించేది.

ఒక్కముక్కలో చెప్పాలంటే గిరికుమారుడికి పూర్ణిమ మీద ఎంత మక్కువో, పూర్ణిమకి గిరికుమారుడి మీదా అంతే ప్రీతి. ఇంకా విశదంగా చెప్పాలంటే వాళ్ళని చూస్తే భార్యాభర్తలని ఎవరూ అనుకోరు. అంతా ప్రేయసీ ప్రియులనే భ్రాంతి పడతారు.

ఇక అటువంటి దంపతులు ఎంత సుఖంగా, ఎంత సరసంగా, ఎంత హాయిగా కాలంగడుపుతారో వర్ణించాలంటే ఏ కాళిదాసో, ఏ షేక్స్పియరో, ఏ రవీంద్రుడో, ఏ శరచ్చంద్రుడో వచ్చి నా కలాన్ని నడపాలిగాని, లేకపోతే నాచేత కాదు. క్షణానికొక కొత్త అందం. క్షణక్షణమూ ఒకకొత్త ఆనందం. అప్పుడు పూర్ణిమ అంటుంది- "నిజంగా మీ తెలివినీ, మీ మంచితనాన్నీ చూసుకుని నే నెంత గర్వపడతాననుకున్నారూ!" క్షణమైనా ఆలస్యంకాకుండా గిరికుమారుడు

"నీ సౌందర్యానికి త్రిభువనాల్లోనూ సాటిలేదని నేను లోపల ఎంత ఉప్పొంగిపోతున్నానో తెలుసా, పూర్ణిమా!" అని బదులు చెబుతాడు. ఈ విధంగా క్షణమొక స్వప్నంగా గడిపేస్తున్నారు.

ఇల్లా కొన్నాళ్లు గడిచినాక పూర్ణిమ భర్తని ఒక ప్రశ్న వేసింది. దాని సారాంశమేమిటంటే "సృష్టి ఆరంభమైనాక నాటివరకూ ఎందరు దంపతులో జీవితంలో వసంతాన్ని అనుభవించారు. వారిలో ఒక్కరైనా మనంత ఆనందాన్ని అనుభవించి ఎరుగుదురూ!"

కొంచెమైనా తడుముకోకుండా గిరికుమారుడు బదులు చెప్పాడు- "నీకా సందేహ మక్కరలేదు. మనంత ఆనందం ఇదివరకెవ్వరూ అనుభవించలేదు. మనకీ ఇంకొరికి పోలికా? మనది సాటిలేని జంట. మనది పోటీలేని సుఖం."

ఇటువంటి సమాధానాలే చెప్పుకుని అందరు భార్యాభర్తలూ తృప్తిపడుతూ వుంటారు కాబోలు!

అవునుకాని సుఖంచేవారికి ప్రశ్నలతో పనేమిటి? ఎప్పుడైతే ప్రశ్నలు బయలుదేరుతవో అప్పుడే అసంతృప్తి మొదలవుతుంది. పూర్ణిమ తన సుఖంతో తాను తృప్తిపడి ఊరుకోరాదూ? తన సుఖంలాంటిది ఇంకెవరన్నా అనుభవిస్తున్నారా అనే సందేహం దేనికి? ఇతరులంతా అనుభవిస్తుండే సుఖమే తనూ అనుభవిస్తుంటే తన సుఖానికి విలువ తగ్గిపోతుందా? ఇతరులకెవ్వరికీ అందని సుఖాన్ని నేనొక్కర్తెనే

అనుభవిస్తున్నాననే గర్వంలోనే ఆమెకి ఆనందముంది కాబోలు!

ఒకటి దోవతీయగానే దాన్ని తోసుకుంటూ వచ్చే గొఱ్ఱెల మందలాగా ఒక ప్రశ్న వెంబడే ఎన్నో ప్రశ్నలు చకచకా బయలుదేరినయ్. ఈ ప్రశ్నల విసురుకి గిరికుమారుడికి ఊపిరి సలపటం లేదు. కాని పూర్ణిమ ప్రశ్న వెంట ప్రశ్నని రివాల్వరులాగా పేలుస్తోంది.

"మనిద్దరమూ ఎల్లకాలమూ ఇంత హాయిగా, ఇంత అన్యోన్యంగా కాలం గడవ గలమా?" అని పూర్ణిమ ప్రశ్న. అప్పుడే కాలమంతా ఒక్కరీతిగా వెళ్ళదనే పిరికితనం పూర్ణిమ గుండెల్లో జొరబడిందన్నమాట. "నీకాభయం అక్కరలేదు. కలకాలమూ ఇల్లాగే కిలకిలలాడుతూ వుంటాం. మనం లోకానికి ఆదర్శంగా వెలిగిపోతాం" అని భర్త జవాబు.

"ఎప్పుడూ ఇంత ప్రేమగా వుండాలి" అని భార్యా.

"తప్పకుండా" అని భర్త.

"ఎన్నడూ విసుక్కోరాదు" అని పూర్ణిమ.

"కలలోనైనా జరగదు" అని భర్త.

"నన్ను క్షణంకూడా విడవకూడదు. నా మీద మీ ఆదరం, మీ గౌరవం పీసంకూడా తగ్గకూడదు" అని భార్య.

"ఎన్నటికీ జరగదు. పూర్ణిమా! నేనంత నీచుడననుకున్నావా?" అని గిరికుమారుడు.

ఇంకేముంది! భర్త ఆడితప్పని మనిషి. ఇక తనకేం

కొదవ? పూర్ణిమ మనసు పూర్ణిమనాటి సముద్రంలాగా గంతులు వేయసాగింది. మిన్నుమన్నులను ముంచి వేసే పరవడితో ఆమె మనస్సులో ఆనందం పొంగి పోతోంది.

తను మాట ఇచ్చాడు. నిలుపుకోలేననే భయం ఏకోశానా లేదు. అసందేహాన్ని కూడా చొరబడనీయకుండా పూర్ణిమ జడని అలంకరించేందుకు మల్లెపూలదండలు గుచ్చుతున్నాడు, గిరికుమారుడు.

వీరిద్దరినీచూసి కాలం ఒక్కనవ్వు నవ్వింది. ఆనవ్వులో యెంత వెక్కిరింత వుందో పూర్ణిమకీగాని, గిరికుమారుడికీగాని అటువంటి స్థితిలో ఉన్న మరే భార్యాభర్తలకి గాని తెలియదనుకుంటాను!

అందుకోసమే కాబోలు కాపురానికి వచ్చిన ఏడాదికే పూర్ణిమ సుధాకరుని కన్నది. ఉన్నఊళ్ళో కాలుమీదకాలు వేసుక్కూచుంటే కాలం గడిచిపోయే అదృష్టం గిరికుమారునికిలేదు. ఊరువిడిచి పట్నవాసాన పొట్టకోసం బ్యాంకులో గుమాస్తాగా చేరవలసి వచ్చింది. అంతవరకూ ప్రేమ సీమలోనూ, భావాంబరాల్లోనూ స్వేచ్ఛగా విహరించిన గిరికుమారుడు ఒక్కసారిగా జీవితంలోని ఇరుకుసందుల్లోని మురికివాసనల్లోకి దిగిరావలసి వచ్చింది. స్వప్నాలకి గుడ్ బై చెప్పి దైనందిన సమస్యలని ఎదుర్కోవలసి వచ్చింది, O! what a fall my countrymen" అనుకుంటుంది గిరికుమారుని మనస్సు. కాని వేరే దోవలేదు.

ఎన్నడూ భర్తమనసుని కష్టపెట్టి ఎరుగని పూర్ణిమ అంటుంది. "ఈవెధవ కొంపలో నేనుండలేనుబాబూ. నేనేం రాణివాసాలు కావాలనటంలేదు. కొంచెం గాలి అల్లల్లాడాలి. మనబాబ్జీకి కులాసాగా ఆడుకునేందుకు కాస్తయినా జాగా వుండాలి. పట్టపగలే దీపం పెట్టాల్సివస్తే ఎల్లా చెప్పండి?" నిజమే కాని అద్దెకి యిల్లు దొరకటంలేదు. ఎల్లాగో అష్టకష్టాలుపడి దీన్ని సంపాదించాడు. అంతటితో తృప్తిపడక గునుస్తూవుంటే గిరికుమారుడికి కష్టంవెయ్యదా? చిరాకుగా "ఇంతకంటె మంచియిల్లు నేను కుదర్చలేను. నా చేతకాదు. ఇష్టమైతేవుండు. లేకపోతే—" అని భార్యముఖంచూసి మధ్యలోనే ఆగిపోయాడు. భర్త ఈవిధంగా మాట్లాడుతాడా? పూర్ణిమ కలలోనైనా తలపోయలేదు. కోపంతో మూతి బిగించుకుని వెళ్ళిపోయింది. ఆఫీసు టైమయిపోయింది. గిరికుమారుడి దారిలో హోటల్లో అన్నంతిని ఆదరబాదరా ఆఫీసుకు పోయాడు. పాపం పూర్ణిమ కోపంతీర్చేవారెవరు?

ఇంకోనాడు పూర్ణిమ భర్తకి జీతంవచ్చిన సంగతి పసికట్టి "ఏమండోయ్, పిల్లడికి హార్లిక్సూ, కూటికూరా పౌడరూ, స్వస్తిక్ కేస్టరాయిలూ, గాడ్‌రెజ్ నంబర్‌వన్ సబ్బూబిళ్ళలూ—" అంటూ ఇంకా ఆగకుండా చెప్పుకు పోతూంది, మిగిలేదేమిటి? బియ్యానికీ, విస్తళ్ళకి, కట్టెలకీ, ఇంటిఅద్దెకీ, పాలకీ పోగా మిగిలేదేమిటి? ఇవన్నీ తెస్తే పేగులు తెగిపోవూ? ఆమాత్రం కనిపెట్టవద్దూ? పైగా ఇంకేవో చెపుతోంది ఇదివరకు చెప్పినవన్నీ భర్త తేగలిగినట్లు, చురచుర

లాడుతూ గిరికుమారుడు "ఇంతేనా ఇంకేమైనా వున్నయ్యా గొంతెమ్మ కోరికలు?" అని అడిగాడు. పూర్ణిమకి పట్టలేని కోపంవచ్చింది. కోపంరాగానే పూర్ణిమ కన్నీరు పిలిస్తే పలుకుతుంది. బటబట రాలుతున్న కన్నీళ్ళని చూసికూడా గిరికుమారు చలించలేదు. కోటు వేసుకుని కొడుకుని కిందదింపి బ్యాంకుకి బయలుదేరాడు. పట్టలేని రోషంతో "ఛీ ఇంతే మీ మగవాళ్ళు" అంది పూర్ణిమ. దెబ్బపడ్డ తాచులాగా చర్రున గిరికుమారుడు "మీ ఆడవాళ్ళు ఇంతేనే వున్నమ్మా" అని వెళ్ళిపోయాడు. అప్పుడు వాళ్ళిద్దరినీ చూసి కాలం మళ్ళీ నవ్వింది. ఈనవ్వులో హేళన లేదు. ఆనవ్వులో దాగిన జాలిని తెలుసుకోవడం కష్టం కాదనుకుంటాను.

మునుపటి శపథాలూ, స్వప్నాలూ ఏమయిపోయినయ్? అవన్నీ కూలిపోయిన గాలిమేడలు. పేలిపోయిన నీటిబుడగలు అందుకనే కాబోలు కాలం నవ్వింది. మళ్ళీ నవ్వింది.

★